





బ్రిటిష్ ప్రభుత్వం అటవీచట్టం ప్రవేశపెట్టినప్పుడు బస్తర్‌లో గిరిజనులు పెద్దఎత్తున తిరుగుబాటు చేశారు. ఆ తిరుగుబాటుకు కారణాలు కనుక్కోవలసిందిగా ప్రభుత్వం ఒక ప్రత్యేక అధికారిని పంపించింది. లేనిపోని భయాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని, వారి అవసరాలన్నీ చట్టంలో మినహాయింపులుగా పొందుపరచారని, కుటుంబానికి ఒక్కరన్నా చదువు కున్నవారుంటే, చట్టం పేరుచెప్పి ఉద్యోగులు అధికార దుర్వినియోగానికి పాల్పడిన సందర్భాలను వారు ఉన్నతాధికారుల దృష్టికి తెస్తారు, కాబట్టి ఎక్కువ పాఠశాలలు ప్రారంభించవలసిందిగా ఆ అధికారి సూచించారు. ప్రజలు తిరుగుబాటు కొనసాగిస్తూ వచ్చారు. ప్రభుత్వం స్పందిస్తూ వచ్చింది. 1876లో భూమిశిస్తు, 1910లో రిజర్వ్ అడవి విస్తీర్ణం తగ్గించింది. 1920-30 సంవత్సరాల్లో వెట్టి తొలగించి సంప్రదాయ వ్యవస్థలకు అధికారాలిచ్చింది. 1966లో బలవంతపు ధాన్యపులేవీ రద్దు చేసింది. బోధ్‌ఘాట్ జలవిద్యుత్ పథకం పక్కన పెట్టింది. 1996లో ఉక్కు ఫ్యాక్టరీ ప్రతిపాదన విరమించింది. ఈ చర్యలన్నీ ప్రభుత్వంమీద ఇంకా అపనమ్మకాన్ని, కక్షనే పెంచాయి.

నేడు బస్తర్‌లోజరుగుతున్న మారణకాండమీద వేసిన అనేక నిజ నిర్ధారణ కమిటీలలో పాల్గొంటున్న ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయు రాలు శ్రీమతి నందినీ సుందర్ 1997లో ప్రచురించిన 'సబాల్టరన్ & సావరిన్స్' సిద్ధాంత గ్రంథం సారాంశం ఇది. నేటి పరిస్థితులనుకూడా చేరుస్తూ శ్రీమతి నందిని అదే పేరుతో వ్రాసిన పుస్తకం ఇప్పుడు మలి ప్రచురణగా వచ్చింది.

ఆ రాష్ట్రంలో రామరాజ్యానికి అంకితమైనట్లు చెప్పుకునే మితవాదపక్షమే అధికారంలో ఉంది. వాళ్ళైనా ప్రజలకు కావలసిన చదువు నేర్పవచ్చు. వారి సమస్యలు పరిష్కరించవచ్చు కాని అందరూ ఉన్మాదు లైనప్పుడు ఆలోచనలు తట్టవు.

రంపపితూరిని (1870) అణచివేసిన ప్రభుత్వం, బోర్డ్ ఆఫ్ రెవిన్యూలో మొదటి సభ్యుడు అంతకుముందు గోదావరిజిల్లా కలెక్టర్ సల్లివాన్‌ను, పితూరికి దారితీసిన కారణాలను విచారించవలసిందిగా పంపింది. చట్టం, ప్రభుత్వం పేరు చెప్పి కిందిస్థాయి అధికారులు, పాలకులు గిరిజనులను దోచుకున్నారని, హింసించారని ఉదాహరణలతో, వాఙ్మూలాలతో నివేదిక ఇస్తూ, జిల్లా అధికారులు తరచు గిరిజన ప్రాంతాలు పర్యటించి కిందిస్థాయి ఉద్యోగుల అధికార దుర్వినియోగాన్ని అదుపుచేయనందుకు మందలించారు. జిల్లా కలెక్టర్ ప్రతిసంవత్సరం 90 రోజులకు తక్కువగాకుండా గిరిజన ప్రాంతాలలో మకాం చేయాలని, ప్రతి సంవత్సరం ఒక నివేదిక పంపిస్తూ దాంట్లో ఎందరు ఉద్యోగులను ఎందుకు శిక్షించింది తెలియచేయాలని నాటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికీ జిల్లా కలెక్టర్లు గిరిజన ప్రాంతాలగూర్చిన సాంవత్సరిక నివేదికలు గవర్నర్‌కు, గవర్నర్ రాష్ట్రపతికి పంపుతున్నారు కాని అవి వట్టి అభివృద్ధి నివేదికలుగా మారాయి.

ఉద్యోగులు, షావుకార్లు, భూస్వాములు, కాంట్రాక్టర్లు గిరిజనులను దోచుకుంటున్న తీరుగూర్చి మానవశాస్త్రవేత్త హెమెండార్ఫ్ ఎంతో రాశారు. నాటి హైదరాబాదు రాష్ట్రం ఆయననే సలహాదారుగా నియమించింది. ఆదిలాబాద్ జిల్లా మర్లవాయి, ఖమ్మంజిల్లా సూదిమళ్ళలో గిరిజనులకు పాఠశాలలు ప్రారంభించారు. కాస్తోకూస్తో చదువుకున్న గిరిజనులకు పట్వారీలుగా, ఫారెస్టు గార్డులుగా ఉద్యోగాలిచ్చారు. హెమండార్ఫ్ 1982లో దిగజారిన పరిస్థితులను చిత్రిస్తూ Tribes of India, Struggle for Survival ('మనుగడకోసం పోరాటం' హైదరాబాదు బుక్‌ట్రస్ట్ ప్రచురణ) అనే పుస్తకం రాశారు. 1987లో మనరాష్ట్ర గిరిజన ప్రాంతాలలోని జిల్లాల్లో ఉద్యోగ నియామకాలలో గిరిజన సంక్షేమశాఖలో 100%, మిగతాశాఖలో 50% ఉద్యోగాలు రిజర్వ్‌చేసింది. కాని దోపిడీ ఏమి తగ్గలేదు.

నేను 1982లో గిరిజనుల సంస్కృతిమీద ఉస్మానియా విశ్వ విద్యాలయంనుండి డాక్టరేట్ తీసుకున్న తరువాత గిరిజనులలో పని చేయడానికి స్ఫూర్తినిచ్చినవి పైన చెప్పిన పుస్తకాలు కావు. అవి తరువాత చదివాను. గిరిజనులు పడుతున్న బాధలకు-ఏంచేయగలం అనే ఆలోచనతో



వెళ్ళాను. సమాధానాలకోసం అందుబాటులో ఉన్న అధికారులను ప్రశ్నించ సాగాను. వారిచ్చిన కాగితాలు, ప్రభుత్వం పనితీరు, నేను నాబృందం అర్థం చేసుకోసాగాం. 'శక్తి' ప్రారంభించిన తొలినాళ్ళలోనే (1985) ఒక సారాకొట్టు మూయించిన సందర్భంగా నలుగురు గిరిజన యువకులతోపాటు నన్ను అరెస్ట్ చేశారు. అదో పెద్ద వార్త అయింది. తీరా తేలిందేమిటంటే, రంపచోడవరం తాలూకాలో గిరిజనేతరుల జనాభా 50% దాటిన నాలుగు గ్రామాలలో ప్రభుత్వసారా అమ్మడానికి అనుమతి ఉంది. కాని కాంట్రాక్టర్లు ఊరూరా కొట్లు తెరిచారు. మేం మూయించిన కొట్టుకూడా అటువంటి మారుమూల గ్రామంలోది. వార్తల ఉధృతిచూసి అదిరిపడిన అధికారులు కొట్టు మూయించారు. కేసు ఎత్తివేశారు. కాని మరుసటి సంవత్సరం కాంట్రాక్టరు కొట్టు తెరిచాడు. గిరిజనయువకులు అడ్డుకున్నారు. కాని కాంట్రాక్టరుకొట్టు ఉండాల్సిందేనని 'రైతుకూలీసంఘాలు' పట్టుపట్టాయి. గిరిజనులు వెళ్ళి వారి నాయకులకు నచ్చచెప్పాలని ప్రయత్నించారు కాని వారు ఒప్పుకోలేదు. మేం పత్రికలకెక్కి ప్రకటనలిస్తూ తగవును సజీవంగా ఉంచదలచుకోలేదు. 'మాటకు మాట తెగులు' ఈవేళ కాకపోతే రేపు అర్థం చేసుకుంటారు, నచ్చచెప్పగలుగుతారు అనుకుని మా కార్యక్రమాలు కొనసాగించాము. ప్రతి విషయంలో చట్టంలో నిబంధనలు, అవి అమలు జరుగుతున్న తీరులోగల తేడా ప్రతిచోటా కనిపించేది. దేన్నీ వదలలేదు. ప్రతీదాన్ని ప్రతిఘటించాం. 1985 నుండి ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన ప్రాంతాలలో ప్రజాస్వామ్యపోరాటం చరిత్ర అంటే అది 'శక్తి' చరిత్రే. 1999లో నల్లమలకు విస్తరించాం. ప్రకాశంజిల్లాలో చెంచులకు పంచాయితీరాజ్ సంస్థలలో ఓట్లు, మహబూబ్‌నగరజిల్లా బల్మూర్ మండలంలో రుషులచెరువు చెంచులకు అప్పగింత, 22 చెంచుగ్రామాలు రెవెన్యూగ్రామాలుగా గుర్తింపు, భూములు, అడవులలో గిరిజనుల హక్కులసర్వే, ఆహారహక్కు ఇలా పని సాగుతోంది.

పశ్చిమగోదావరిలో పుంజుకున్న భూపోరాటంలో వేలాదిమంది గిరిజనులమీద, మా కార్యకర్తలమీద కేసులు పెట్టి జైలుకు పంపారు. వారందరికీ న్యాయసహాయం చేస్తున్న మా దంపతులమీద కేసులు పెట్టారు. కోర్టులో ముందస్తు బెయిల్ తీసుకుని మాపని మేంసాగిస్తున్నాం. పశ్చిమగోదావరి, ఖమ్మంజిల్లాలో భారతదేశంలోనే మొదటిసారిగా ప్రభుత్వం భూమి రికార్డులను గిరిజనులకు పంచిపెట్టి హక్కుల తనిఖీ చేపట్టింది. ఆ రికార్డులను అర్థంచేసుకోడానికి మేం శిక్షణ ఇస్తున్నాం. నాటి మిత్రపక్షాలైన వామపక్షాలు కొన్ని ఊళ్ళలో ఉద్యమాన్ని పక్కదారి పట్టించాయి. ప్రజల ఆలోచనలో మార్పు రావాలంటే చాలా ఓపికగా పనిచేయాలి.

'గాయం' పుస్తకం ముందుమాటలో ఈ ప్రస్తావనలు అధిక ప్రసంగమైనా, ఈవేళ గ్రామీణ ప్రాంతాలలో, గిరిజన ప్రాంతాలలో ఇదే అజ్ఞానం, అంతరం తాండవిస్తున్నది. చిన్న సమస్య దగ్గరనుండి ఓటర్ల జాబితాలో పేర్ల నమోదువరకు ప్రజలు రాజకీయ నాయకులమీద ఆధారపడుతున్నారు. ఎవడినో పట్టుకొని పనిచేయించుకుంటూ మోసపోతున్నారు. ఆక్రోశిస్తున్నారు, గర్జిస్తున్నారు, రెచ్చిపోతున్నారు, నలిగిపోతున్నారు.

ఐదేళ్ళకోసారి తమ కోపం వెళ్ళగక్కడంతో సరిపోదు. సంఘటిత శక్తితో తమ హక్కులు సాధించుకోవడం నిరంతర ప్రక్రియ. అందుకు కావలసిన జ్ఞానం విశ్వవిద్యాలయాల్లో, ఉన్నతపాఠశాలల్లో, సార్వత్రికవిద్యలో ఎందుకు లేదో అర్థంకాదు. అనేక సంఘాలతో మమేకమై పని చేసే మేధావులుకూడా రాజకీయాలు మాట్లాడతారు కాని వీటిజోలికి పోరు. ఎందరో రిటైరైన ఉన్నతాధికారులున్నారు. వాళ్ళు ప్రభుత్వాన్ని కదిలించే ప్రయత్నాలు చేస్తుంటారు, ప్రభుత్వం పిలుపుకోసం ఎదురుచూస్తుంటారు కాని పరిపాలనలో సాధారణ విభాగాలైన, రెవెన్యూ, ఫారెస్టు, కనీసవేతనాలు, పోలీసు, న్యాయ వ్యవస్థలతో తలపడడం ప్రజలకు నేర్పి, ధైర్యంచెప్పి, వారు తమహక్కులు సాధించుకోవడంలో తోడ్పడంలేదు. కొందరికి సిద్ధాంతాలమీద నమ్మకం, కొందరికి రాజకీయాలమీద నమ్మకం, ప్రజలమీద ఎవరికీ నమ్మకంలేదు. సాంస్కృతికరంగంలోకూడా అంతే, పల్లెప్రజల పాటల బాణీలు, దరువులలో సిద్ధాంతాలు దట్టించడం తప్ప - సంప్రదాయంలోగల తిరుగుబాటును మేల్కొల్పడంలేదు.

పాండవులరాజ్యం వస్తుందని పూజారులు పాటలు పాడుతూ విశాఖ గిరిజనాన్ని తిరుగుబాటుకు ఉసిగొల్పుతున్నారంటూ, 1870లో, నాటి విశాఖజిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి వర్తమానం పంపినట్లు సబాల్టరన్ స్టడీస్-1లో చరిత్రకారుడు డేవిడ్‌ఆర్నాల్డ్ రాసాడు. నా పరిశోధనలో విశాఖమన్యంలో ఏడురోజుల 'నందిపండుగ' పాండవులపాట సేకరించాను. 'పంచపాండవుల పంట - దుర్యోధనుడి వంట' (కొండవారిపంట - దిగువవారివంట) అంటూ ముగిసే ఆ పాటలో తమను ఎలా దోచుకుంటుందీ గిరిజనులు వివరిస్తారు. గిరిజనులను చైతన్యపరచవలసిన అవసరం లేదు. దోపిడీ జరుగుతుందని వారికి తెలుసు. వారు పుట్టుకతోనే సాయుధులు. కాని **మారుతున్న వ్యవస్థలో ఏరకమైన చదువు ఈ దోపిడీని అరికట్టడానికి అవసరమో అది నేర్పాలి.** వారి సంప్రదాయం మార్పుకనువుగా కొత్తరూపం సంతరించుకొని జలపాతంలా దూకి విద్యుత్తును నింపాలి.



పాత్రికేయులు వుప్పలనరసింహంగారు మనసులను కలచివేస్తున్న 'హింసణచణ ధ్వంసరచన' కు స్పందిస్తూ చాలా ఉద్విగ్నతతో వ్రాసిన వ్యాసాలివి. అయితే వారు ఆశించినట్లు కాలపుసుడిగాలిలో కొట్టుకుపోతున్న యువతరంగాని, కార్పోరేట్‌రంగంకాని, చరిత్రకారులుగాని మార్పుకు ఎంత దోహదం చేస్తారో, ఎప్పటికి వారికి బోధపడుతుందో అర్థం కావడంలేదు. వాళ్ళింకా 'ఆకాశపు దారివెంట పడిపడి'గా వెళ్ళిపోతున్నారు. రామచంద్ర గుహ తన పుస్తకం How Much Should A Person Consume?లో (2006) చండీ ప్రసాద్‌భట్‌మీద వ్యాసానికి, నా స్పందనను ఉటంకించారు. ఆ స్పందనలో శ్రీభట్ మాకిచ్చిన స్ఫూర్తిని, చట్టాన్ని ఉపయోగించుకుంటూ 'శక్తి' తెస్తున్నమార్పును ప్రస్తావించాను. ఆయన తరచు పేర్కొనే చిప్కో ఉద్యమం - హృదయస్పందనతో తెచ్చిన మార్పు. కాని జనసామాన్యానికి అడుగడుగునా జ్ఞానంతో, ధైర్యంతో ముందుకుపోయే దారి కావాలి. శ్రీగుహ కూడా నందినితోపాటు నిజనిర్ధారణ కమిటీలో బస్తర్ పర్యటించారు. పోయిన సంవత్సరం జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థలో గిరిజనులలో పనిచేస్తున్న కష్టకారిసంఘటన నాయకుడు ప్రదీప్‌ప్రభు ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో నా ప్రసంగాన్ని శ్రీమతి నందిని హిందీలో అనువదించారు. చరిత్రదృష్టితో తప్ప పరిపాలన దృష్టితో గ్రామస్థాయి రికార్డులు తానెప్పుడూ చూడలేదని ఆమె చెప్పుకొచ్చారు. తనవంటి కొందరికి రెండు మూడు రోజుల సమావేశం త్వరలో ఒక గ్రామంలో ఏర్పాటు చేసి వీటిని తెలియజేయవలసిందిగా కోరారు. వీరందరూ మార్పు తెచ్చే దారుల గూర్చి రాస్తారని యువచైతన్యాన్ని భూమార్గం పట్టిస్తారని, పాత్రికేయులు వుప్పల నరసింహంగారు కూడా ప్రజలకు ఆ రహదారి పదేపదే గుర్తుచేస్తారని ఆశిద్దాం.

**కొందరు నవయువకులు రాబోవుయుగం దూతలు**
**పావన నవజీవన బృందావన నిర్మాతలు - శ్రీశ్రీ**

**డా॥ పి. శివరామకృష్ణ**
'శక్తి' సంచాలకులు